క్లుప్తంగా

ఆస్పత్రి సిబ్బందికి వస్త్రాల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు సరుకులు, వస్త్రాలు అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

గూడూరు రూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా గూడూరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు పల సరుకులు, నూతన వస్త్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ హెలెన్, ట్రస్టు ప్రతినిధులు వెంకటేశ్వర్లు నాయుడు, బాబు, భాస్కర్, చంద్రయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తాళ్లమ్మ గ్రామోత్సవం



తాళ్లమ్మను ఊరేగిస్తున్న ఆలయ నిర్వాహకులు

గూడూరు రూరల్ : గూడూరు గ్రామ దేవత తాళ్లమ్మ గ్రామోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు గ్రామోత్సవం అనంతరమే గూడూరు పట్టణంతో పాటు రూరల్ ప్రాంతాల్లో భోగి మంటలు వేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం అమ్మవా రి ఉత్సవ మూర్తిని విశేషంగా అలంకరించి గూడూరు గ్రామ పొలిమేరల్లో ఉన్న ఆలయం నుంచి పట్టణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. మహిళలు అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గౌడ సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

కోట : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కోరారు. కోటలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై చర్చించారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇసుక కొరత లేకుండా చూడాలని కోరారు. కార్మికులకు బీమా సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు వెంకటక్రిష్ణయ్య, కార్యదర్శి నాగరాజు, పోలయ్య పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు క్రీడా మైదానం సిద్ధం



యంత్రాలతో మైదానాన్ని చదును చేయిస్తున్న నిర్వాహకులు

చిల్లకూరు : సంక్రాంతి సందర్భంగా ప్రతి ఏటా గూడూరు పట్టణంలోని క్రికెట్ క్రీడాకారులకు మూడు రోజులు క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ ఏడాది కూడా గూడూరుకు చెందిన కనుమూరు హరిశ్చంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గూడూరు మాస్టర్స్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో సోమ, మంగళ, బుధవారాలు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. భారీ యంత్రాలను ఉపయోగించి క్రీడా మైదానాన్ని చదును చేయడంతో పాటు క్రికెట్ పిచ్‌ను ప్రత్యేకంగా వేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వృద్ధులకు నిత్యావసర సరుకుల అందజేత



దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సుబ్రమణ్యం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమానికి ఆదివారం అత్తికాయల సుబ్రమణ్యం దుస్తులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అదే విధంగా భోగి, మకర సంక్రాంతి పండుగ నాడు పిండి వంటలు పెట్టడానికి నగదు అందజేశారు. వృద్ధుల ఆలనాపాలనా చూస్తున్న ఆశ్రమ నిర్వాహకులు సునిత, బెన్నిని అభినందించారు.



వినియోగదారులు లేక వెలవెలబోతున్న గూడూరులోని బజారు వీధి

కళ తప్పిన సంక్రాంతి

సంక్రాంతి పండుగ వస్తుందంటే పల్లెల్లో ఎక్కడ చూసినా సందడి కనిపిస్తుంది. ఎడగారు పంట పూర్తయి ధాన్య లక్ష్మి ఇంటికి చేరుకుంటుంది. దీంతో ఇంటిల్లిపాదికీ కొత్త బట్టలు కొనుగోలు చేస్తారు. కొత్త అల్లుళ్లు, ఆడ బిడ్డలను ఇంటికి ఆహ్వానించి సారె పెడతారు. భోగి మంటలు వేస్తారు. పెద్దలకు తర్పణాలు వదులుతారు. పాడి పశువులను అలంకరించి పోటీలకు సిద్ధం చేస్తారు. సంక్రాంతిని జరుపుకునేందుకు ఎక్కడెక్కడో స్థిరపడిన వారు సైతం స్వగ్రామం చేరుకుంటారు. ఇదంతా గతం. నేడు గ్రామాల్లో ఆ సందడి కనిపించడం లేదు.

- గ్రామాలకు చేరని ఆత్మీయులు, బంధువులు
- ఇళ్ల ముందు కనిపించని ముగ్గులు, గొబ్బెమ్మలు
- సంక్రాంతి సందడి లేక వెలవెలబోతున్న గ్రామాలు

చిల్లకూరు : గూడూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎక్కువ మంది వ్యవసాయంతోపాటు చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. దీంతో రైతులు కోలుకోలేని పరిస్థితికి చేరుకున్నారు. గత ఐదేళ్లలో అప్పటి ప్రభుత్వం ప్రతి ఇంటికీ వివిధ పథకాల కింద కొంత నగదును ఖాతాల్లో జమ చేసేది. దీంతో పండుగను ఆనందంగా జరుపుకునే వారు. ప్రస్తుత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. దీనికితోడు ఇసుక కొరతతో పనులు జరగడం లేదు. దీంతో పేదల కుటుంబాల్లో సంక్రాంతి కళ కనిపించడం లేదు.



గొబ్బెమ్మతో తిరుగుతున్న మహిళ

పండగ వచ్చినా కనిపించని ఊరి బంధువులు

ధనుర్మాసం ప్రారంభం నుంచి సంక్రాంతి పండగ వరకు ప్రతి ఊరిలో ఆత్మీయులు, బంధువులు కనిపించే వారు. నేడు ఎవరూ రావడం లేదు. వేకువజామునే ఇంటి ముంగిట పేడ కల్లాపి చల్లి, రంగు రంగుల ముగ్గులు వేసి గొబెబ్బెమ్మలను పెట్టేవారు. అనంతరం గుమ్మడి పూలతో అలంకరించే వారు. నిద్ర లేచే సరికే ఊరిలో బుడబుక్కలోడు(కాటి కాపడు) డమరుకం వాయించుకుంటూ అన్ని వీధులు తిరిగి నిద్ర లేపేవాడు. అటు తరువాత ప్రతి ఇంటికీ వచ్చి వారు ఇచ్చినది తీసుకుని వెళ్లేవాడు. అలాగే హరిదాసులు ఇంటి ముంగిటకు వచ్చి హరిలోరంగ హరి అంటూ భక్తి గీతాలు ఆలపిస్తుంటే వారికి పెండ్లికాని యువతుల ద్వారా బియ్యం, పప్పులు ఇప్పించే వారు. అలాగే పల్లెలోని యువతులు, మహిళలు గుంపులుగా చేరి గొబ్బి పాటలు పాడుతూ అలరించే వారు. పిట్టల దొరలు, పగటి వేషగాళ్లు సందడి చేసేవారు. నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.



కళాకారుల వేషధారణ

వ్యాపారాలు కూడా అంతంత మాత్రమే

సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఇంటిలో పిండి వంటలు చేయాల్సిందే. ఇందుకు అవసరమైన పప్పులు, బెల్లం, ఇతర సరుకులు తెచ్చుకోవడంతో పాటు ఇంటిల్లిపాదికీ కొత్త బట్టలు కొనేవారు. వీటి కోసం పల్లె నుంచి పట్టణాలకు వెళ్లేవారు. దీంతో పట్టణ ప్రాంతాలు పండుగకు వారం ముందునుంచే కళకళలాడేవి. ఈ ఏడాది పండుగకు ఒక్క రోజు ముందు కూడా గూడూరు బజారులోని వీధులు జనసంచారం లేక వెలవెల బోతూ కనిపించాయి.

భోగ భాగ్యాలతో సంక్రాంతి వెలుగులు నిండాలి



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: ప్రతి ఇంటా సంక్రాంతి వెలుగులు విరజిమ్మాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవించాలని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆయన ఆదివారం వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు భోగి, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

18న మండల సర్వసభ్య సమావేశం

రాపూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భవాని ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

సైదాపురం పోలీసు స్టేషన్ తనిఖీ

సైదాపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆదివారం రాపూరు సీఐ సత్యనారాయణ తనిఖీ చేశారు. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి వివాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడా కోడిపందేల్లు జరగకుండా చూడాలన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలను అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలం ఆరూరు బొజ్జనగుంట సమీపంలో పంట పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి రాగి తీగలను చోరీ చేశారు. గతంలో కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేయడంతో నీరు లేక పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలతో పాటు రొయ్యల గుంతల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు చోరీ చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్త దానం చేస్తున్న శ్రీనివాసులు, శిరీష

చిల్లకూరు : రక్త దానం ప్రాణదానంతో సమానమని, యువకులు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని చేడిమాలలోని ట్రస్టు కార్యాలయం వద్ద ఆదివారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా రక్త దాన శిబిరం ఏర్పాటుచేశారు. చేడిమాల, నల్లాయగారిపాళెం గ్రామాల ప్రజలకు దుస్తు లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సహ వ్యవస్థాపకులు శిరీష, పిచ్చయ్యనాయుడు, రామానాయుడు, శ్యామ్‌ప్రసాద్, వెంకటేశ్వర్లునాయుడు, బాబు, ప్రజేంద్రరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కరపాకలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

దొరవారిసత్రం: మండలంలోని అక్కరపాకలో ఆదివారం కోగిలి జయరామయ్య జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. విజేతలకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేయనున్నట్టు నిర్వాహకులు రంగయ్య, నరేష్ తెలిపారు. మన్నేలి బాలగురవయ్య, పసల ఆనందయ్య, బద్దిచెంగయ్య, చుక్కల ఎల్లయ్య, కోగిలి శరత్‌సాయి, చింతపూడి చెంగయ్య, మన్నేలి పరమేశ్వరావు, మన్నేలి పురుషోత్తం పాల్గొన్నారు.

గుండ్లసముద్రం గిరిజన కాలనీలో ముగ్గుల పోటీలు



మహిళలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి రూరల్ మండలం గుండ్లసముద్రం గిరిజన కాలనీలో ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్, చిత్తూరు ఉమ్మడి జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామయ్య, ఆత్తూరు చెంగల్రాయులు తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరి : బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వెంకటగిరిలో..

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం గునకల లక్ష్మీప్రసన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి జై చంద్ర, మున్సిపల్ కమిషనర్ శ్రీనాథ్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సుధాకర్, బీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని నాయుడుచెరువుకండ్రిగ గ్రామంలో కోడిపందెం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ లక్ష్మీభవాని తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఇందులో ఐదుగురిని అరెస్టు చేసి 5 పందెం కోళ్లు, రూ.9,050 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెట్టును ఢీకొన్న లారీ



దొరవారిసత్రం : మండలంలోని కలగుంట గ్రామ సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం వరి కోత మెషిన్‌ను తరలిస్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. స్థానికుల కథనం మేరకు... లారీ వరికోత మెషిన్‌ను తీసుకుని నెల్లూరు నుంచి చెన్నైకి వెళుతోంది. కలగుంట బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి డ్రైవర్ నిద్రలోకి జారుకున్నాడు. దీంతో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. లారీ డ్రైవర్ ముత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కండలేరులో 56.304 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 56.304 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి



వంజివాకలో స్వామి వివేకానంద జయంతి

కోట: నేటి యువత స్వామి వివేకానందుని బోధనలను స్ఫూర్తిగా తీసుకోవాలని నవచైతన్య యువజన సంఘం అధ్యక్షుడు బాలక్రిష్టారెడ్డి పిలుపునిచ్చారు. వంజివాకలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలక్రిష్టారెడ్డి మాట్లాడుతూ జాతిని జాగృతం చేసిన గొప్ప మహనీయుడు స్వామి వివేకానందుడని కొనియాడారు. సుజిత్ రెడ్డి, నికేష్, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట : భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచం నలుదిశలా చాటి చెప్పిన చైతన్యమూర్తి స్వామి వివేకానంద అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్ తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, సీనియర్ నాయకులు చెన్నకేశవరావు, కోటయ్యగౌడ్, కరింగాల కందయ్య, బెజవాడి విజయమ్మ, సాగర్, వాసు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ సమావేశం

కోట: మండలంలోని గూడలి కొండపై ఉన్న భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం విశ్వ హిందూ పరిషత్ సమావేశం ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆలయాల అభివృద్ధికి వీహెచ్‌పీ చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా గూడలికి చెందిన లక్కు దేవేంద్రరెడ్డిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మురళీక్రిష్టారెడ్డి, బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



ఉపాధ్యాయులతో కలిసి సమావేశమైన పూర్వ విద్యార్థులు

- పాఠశాల అభివృద్ధికి చేయూత
- స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

సైదాపురం : వారంతా 30 ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో కలిసి చదువుకున్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించారు. ఎక్కడెక్కడో స్థిర పడ్డారు. అందరూ మళ్లీ కలిశారు. పేరు పేరునా పలుకరించుకున్నారు. గత మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. తమ అభివృద్ధికి బాటలు వేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సంఘటన మండల కేంద్రమైన సైదాపురంలోని గోగినేని వెంకటసుబ్బానాయుడు ఉన్నత పాఠశాలల్లో ఆదివారం చోటు చేసుకుంది. ఈ పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదివిన వారు ఆదివారం సమావేశమయ్యారు. తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు మృతిచెందిన విషయం తెలుసుకుని సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

భగవద్గీత పఠనంతో విజ్ఞానం



తిరుమూరులో భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

వాకాడు : భగవద్గీతను పఠనం చేయడం ద్వారా జీవితంలో ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చని నెల్లూరుకు చెందిన త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు డి.సురమౌళి తెలిపారు. ఆయన ఆదివారం వాకాడు మండలంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. సురమౌళి మాట్లాడుతూ భగవద్గీత విశిష్టత, గొప్పతనాన్ని నేటి తరానికి తెలియజేయడానికి ప్రచారం చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా భగవద్గీతను పఠించాలని సూచించారు.

వెంకటగిరిలో భోగి పండుగ సందడి

వెంకటగిరి రూరల్/రాపూరు/సైదాపురం/నాయుడుపేట టౌన్ : సంక్రాంతి పండుగ పర్వదినాన్ని ఘనంగా జరుపుకునేందుకు వెంకటగిరి పట్టణ ప్రజలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా వస్త్రాలు, పండ్లు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు పట్టణానికి తరలివచ్చారు. దీంతో దుకాణాలు కిటకిటలాడాయి. భోగి మంటలు వేసుకునేందుకు కంప, తాటాకు మట్టలు తదితరాలను సిద్ధం చేసుకున్నారు. రాపూరులోనూ సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. కొనుగోలు దారులతో వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి. భోగి మంటలు వేసేందుకు తుట్లును ట్రాక్టర్లల్లో తరలించారు. సైదాపురం మండలంతోపాటు నాయుడుపేట పట్టణంలో ఆదివారమే సంక్రాంతి సందడి నెలకొంది. కొంతమంది ఆదివారం రాత్రే భోగి మంటలు వేశారు. నాయుడుపేట పట్టణంలోని బజారు వీధులు, మార్కెట్ సెంటర్, పాత బస్టాండు, జీఎన్‌టీ రోడ్డు, రైల్వే స్టేషన్ కూడలి, వైఎస్సార్ సర్కిల్, బేరిపేట, వెల్‌కం సెంటర్, పడమటి వీధి, గాంధీ మందిరం, పిచ్చిరెడ్డితోపు తదితర ప్రాంతాల్లోని కూడళ్ల వద్ద పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు.



సైదాపురంలో వేసిన భోగి మంటలు



రాపూరు: భోగి మంటల కోసం..